సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 1 । నవంబర్ । 2023



సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమానికి ఆర్.శివరామప్రసాద్, లక్ష్మీ అలివేలు మంగతాయారు దంపతులు (విజయవాడ) రూ.1,00,000 విరాళం అందజేశారు.



సహకార సంఘాలకు ఆదాయ మార్గాలను అన్వేషించాలి

సహకార సంఘాలకు ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలని కేంద్ర సహకారశాఖ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్ఎల్ఎన్‌టి శ్రీనివాస్ సహకార సంఘ అధికారులకు పిలుపునిచ్చారు. 8లో

నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పుడెల్టాకు 3,000, మధ్యడెల్టాకు 2,300, పశ్చిమడెల్టాకు 6,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

5 నాటికి పూర్తయిన భవనాలు అప్పగించాలి

- ప్రతిష్టాత్మకంగా ప్రాధాన్యతా భవనాల నిర్మాణం
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నిర్మాణాలు పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను ఈ నెల 5వ తేదీ నాటికి సంబంధిత శాఖలకు అప్పగించాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రాధాన్యతా భవనాల నిర్మాణం చేపట్టిందన్నారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలలో సానుకూల పనితీరు ఉన్నప్పటికీ, పూర్తయిన 70 భవనాలను సంబంధిత శాఖలకు అప్పగించడంలో జాప్యం జరుగుతోందన్నారు. గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు. వైద్య, ఆరోగ్య, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని భాగస్వాములు చేయాలన్నారు. 16 సచివాలయాలు, 21 రైతు భరోసా కేంద్రాలు, 33 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను 5వ తేదీ నాటికి ఆయా శాఖలు స్వాధీన పరచుకుని నివేదిక అందజేయాలన్నారు. దశల వారీగా పూర్తి చేసిన పనుల బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

ఆర్యాపురం బ్యాంకు చైర్మన్‌గా జేసీ తేజ్ భరత్



జేసీ తేజ్ భరత్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆరు నెలల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. చైర్మన్‌గా జేసీ, సభ్యులుగా జిల్లా సహకార ఆడిట్ అధికారి, సహాయ రిజిస్ట్రార్ (పరిపాలన) డివిజనల్ సహకార అధికారులను నియమిస్తూ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. జేసీ తేజ్ భరత్‌కు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

బాణసంచా షాపులు నిబంధనలు పాటించాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దీపావళి బాణసంచా షాపుల నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. దీపావళి పండగ ముందస్తు ఏర్పాట్లపై డీఆర్వో జి.నరసింహులు, కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు, సమన్వయ శాఖల అధికారులతో మంగళవారం జేసీ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాణసంచా షాపుల వద్ద అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పెద్ద మొత్తంలో దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతంలో షాపుల మధ్య నుంచి ఫైర్ వాహనం వెళ్లేలా దూరం పాటించాలన్నారు. సింగిల్ విండో విధానం ద్వారా షాపునకు అనుమతి ఇవ్వాలన్నారు. ఇందుకోసం ఆర్డీవో, కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమన్వయ శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. షాపుల నిర్వహణ, అమ్మకపు పన్ను వసూలు, జీఎస్టీ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు. పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేసి నివేదిక అందచేయాలన్నారు. ఇళ్ల మధ్యలో మందుగుండు సామగ్రి నిల్వ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి సీహెచ్ ఎంఎల్ కింగ్, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, పోలీసు, పంచాయతీ, మత్స్య, దేవదాయశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఈ క్రింద తెలిపిన విలేజ్ హెల్త్‌క్లినిక్, యూపీహెచ్‌సీల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. వేమగిరి–2 (కడియం), నరసాపురం (కోరుకొండ), తాళ్లపాలెం (నిడదవోలు), పిడింగొయ్యి –4 (రాజమహేంద్రవరం రూరల్), తూర్పుగానుగూడెం (రాజానగరం), రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్, ఆనంద నగర్, ఆవ వాంబేకాలనీ, మెరకవీధి, సారంగధరమెట్ట యూపీహెచ్‌సీల్లో జరుగుతాయన్నారు.

కేరాఫ్ భద్రం.. భరోసా



ప్రైవేట్ కొరియర్ సేవలకు దీటుగా ప్రభుత్వ నిర్వహణలోని ఏపీఎస్ఆర్టీసీ కార్గో సేవలను విస్తరించింది. ఇంతవరకు ప్రయాణికులకు గమ్య స్థానాలకు చేర్చడం, సరుకు రవాణాకే పరిమితమైన ఆర్టీసీ ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తోంది. మన రాష్ట్రంలోని దాదాపు 84 ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతోపాటు భద్రంగా ఇంటికి సరుకు చేరవేసే దిశగా ప్రయత్నాలను వేగవంతం చేసింది.

- ఇంటివద్దకే ఆర్టీసీ కార్గో సేవలు
- అమలులోకి డోర్ డెలివరీ విధానం
- యువతకు ఉపాధితో భాగస్వామ్యం
- ఈ ఏడాది కార్గో లక్ష్యం రూ. 31.31కోట్లు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ డోర్ డెలివరీ సేవలందించే దిశగా చర్యలు ప్రారంభించింది. ఇంతకాలం మారుమూల గ్రామాలకు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన ఆర్టీసీ చాలా కాలం క్రితమే కార్గోసేవా రంగంలో అడుగుపెట్టింది. మారిన పరిస్థితులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ తన పంథా మార్చుకుంది. ప్రజలకు మరింత సేవలను విస్తరించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో జిల్లా పరిధిలో కార్గో డోర్ డెలివరీ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ప్రైవేటు కొరియర్ సర్వీసులకు ఏ మాత్రం తీసిపోని విధంగా మరింత నమ్మకం కలిగించే రీతిలో సేవలకు మెరుగులు దిద్దుతోంది.

ఈ నేపథ్యంలో అక్టోబరు 26 నుంచి నవంబరు 25 వరకూ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ మాసోత్సవాల సందర్భంగా ప్రతీ జిల్లాలో నెల రోజుల పాటు డోర్ డెలివరీ లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆయా డిపోలలో లక్ష్యాన్ని సాధించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



రాజమహేంద్రవరంలో పార్శిల్ డెలివరీ కౌంటర్

విస్తృత కసరత్తు

రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటల్లో రవాణా చేసిన సరుకులు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో సరుకులు రవాణా చేసి ఆదాయం ఆర్జించేందుకు ప్రణాళిక తయారు చేశారు. ఖాతాదారులకు మరింత చేరువయ్యేందుకు తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని 11 డిపోల పరిధిలో సమర్థంగా సరకు రవాణా చేసేందుకు కసరత్తు చేపట్టారు. ఇంటి సామాన్లు సైతం రవాణా చేసేందుకు ఓకే అంటున్నారు. ఇప్పటికే 10 టన్నుల మేర బల్క్ రవాణాకు ప్రత్యేక వాహనాలను రెడీ చేశారు. రాష్ట్రంలో అగ్రస్థానం సాధించేందుకు అవసరమైన ప్రయత్నాలు చేపట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.31.32 కోట్ల లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యచరణ అమలు చేస్తున్నారు. మూడు జిల్లాల పరిధిలో ప్రస్తుతమున్న 13 కాంట్రాక్ట్ కౌంటర్లతో 40 ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ కౌంటర్లు (ఏటీబీ) పనిచేస్తున్నాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో ఎనిమిది కార్గో వెహికల్స్ ద్వారా రవాణా సాగిస్తున్నారు.

యువతకు భరోసా

కార్గో ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. తక్కువ పెట్టుబడితో ఆదాయం సాధించేందుకు వీరికి ఏటీబీ కౌంటర్లు ఏర్పాటు చేస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, కాకినాడ జిల్లాలోని కాకినాడ, సామర్లకోట,తుని, అన్నవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, రాజోలు, రావులపాలెం డిపోలు ఉన్నాయి. 50 కేజీల బరువుగల వస్తువులను 10 కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ చేసేందుకు పూర్తిగా సంసిద్ధంగా ఉంది. తూర్పు గోదావరిలో 16, కాకినాడ జిల్లాలో 11,కోనసీమ జిల్లాలో 13 ఏటీబీ కౌంటర్ల ద్వారా ఆర్టీసీ సేవలు అందిస్తుంది.

ఏటీబీ కౌంటర్ పొందడం ఎలా ?

కంప్యూటర్, వెబ్ కెమెరా, బస్టాండ్ సమీపం లోరూమ్, వేయింగ్ మెషీన్, ప్రింటర్ కలిగి ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ , ఈ మెయిల్ ఐడీ, నంబరు పాస్ పోర్టు ఫొటో, మొబైల్ నంబర్‌తో రాజమహేంద్రవరం కార్గో కార్యాలయంలోదరఖాస్తు చేసుకోవాలి. 4 రోజుల్లో ఆర్టీసీ ఐడీవస్తుంది. అప్పటి నుంచి సరకు రవాణా బుక్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఏటీబీ కౌంటర్ పెట్టాలనుకునే ఔత్సాహికులు తక్కువ పెట్టుబడితో ఆదాయం పొందేలా ఆర్టీసీ అవకాశం కల్పిస్తున్నది. గ్రామాల్లో రూ.1,000, మున్సిపాలిటీల్లో రూ.2,500, కార్పొరేషన్లో రూ.5,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఏటీబీ ఏజెంట్‌గా అర్హత పొందిన వారికి సరకులు బుకింగ్‌పై 15 శాతం ఆదాయం వస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఆన్‌లైన్ టికెట్ అమ్మకాలు చేయవచ్చు. ఇందుకు ఆర్టీసీ కమీషన్ చెల్లిస్తుంది.

గడచిన ఆరు నెలల్లో కార్గో అర్జన

జిల్లా	లక్ష్యం (రూ. కోట్లలో)	6 నెలల్లో సాధించింది (రూ.కోట్లలో)
తూర్పు గోదావరి	13.17	4.98
కాకినాడ	8.25	2.94
కోనసీమ జిల్లా	9.90	3.25

కార్గో మాసోత్సవాల్లో పార్శిళ్ల లక్ష్యం

తూర్పు గోదావరి	9000
కాకినాడ	4036
అంబేడ్కర్ కోనసీమ	9540



డోర్ డెలివరీ చేస్తున్న దృశ్యం

ఎక్కడి నుంచి ఎక్కడకైనా ..



సరుకులను తక్కువ సమయంలో ఎక్కడి నుంచిఎక్కడకైనా చేరవేస్తాం. డోర్ డెలివరీపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించనున్నాం. అదేవిధంగా వినియోగదారులకు బహుమతులు అందించాలని నిర్ణయించాం. 10 టన్నుల సామర్థ్యం కలిగిన బల్క్ సరుకులు రవాణాచేసేందుకు ప్రత్యేక వాహనాలు రెడీగా ఉన్నాయి. విద్యాశాఖకు చెందిన పుస్తకాలు,ఏపీ సీడ్స్, ఈఎస్ఐ మెడిసిన్ సరఫరా చేస్తున్నాం. జిల్లాలో మరిన్ని ఏటీబీ కౌంటర్ల ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఆసక్తిగలవారు రాజమహేంద్రవరంలో సంప్రదించవచ్చు.

–మాధవ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్), రాజమహేంద్రవరం

ఎఫ్ఓబీ పనుల్లో జాప్యం ఎందుకు?

- జనవరి ఒకటికి పూర్తి కావాల్సిందే
- కాంట్రాక్టర్‌తో ఎంపీ భరత్ రామ్



నేషనల్ హైవే పీడీకి సూచనలు చేస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ) నిర్మాణ పనుల్లో జాప్యంపై ఎంపీ భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం పనులను పరిశీలించారు. అనుకున్న స్థాయిలో జరగకపోవడంతో కాంట్రాక్టర్‌ను నిలదీశారు. గత వారం సమీక్షించి, వచ్చే వారం నాటికి చేయాల్సిన పనులను లిఖితపూర్వకంగా రాసిచ్చినా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇలాగైతే నిర్దిష్ట సమయానికి వంతెన ఎలా పూర్తవుతుందంటూ కాంట్రాక్టర్లను, ఆ సంస్థ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జనవరి మొదటికి వంతెన పనులు పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు

ఎంపీ భరత్ రామ్ విలేకరులతో మాట్లాడుతూ మోరంపూడి జంక్షన్ ఎఫ్ఓబీ పనుల నాణ్యతపై ప్రతిపక్షాలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఆ ఆరోపణలు చేసే వారెవరైనా ఒకసారి పనులు పరిశీలించి, ఆ తరువాత మాట్లాడితే బాగుంటుందన్నారు. నేషనల్ హైవే అథారిటీ పీడీ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయని, చెక్ రిపోర్టులు పరిశీలించుకోవచ్చునన్నారు. నాణ్యత లేకుండా పనులు చేస్తే నేనే క్రిమినల్ కేసులు పెట్టిస్తానని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. 15 ఏళ్లు అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు ఏమి చేశారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్లు కరోనా కారణంగా పోతే, మిగిలిన రెండున్నర సంవత్సరాలలో అభివృద్ధిని ఎలా పరుగులు పెట్టించామో అందరూ చూస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి విషయంలో చంద్రబాబు, లోకేష్ ఎవరు బహిరంగ చర్చకు వచ్చినా తాను సిద్ధమేనన్నారు. మూడు పర్యాయాలు నగర కార్పొరేషన్ మేయర్లు టీడీపీ వారే ఉన్నారు కదా.. వారెందుకు అభివృద్ధి చేయలేకపోయారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే పీడీ సురేంద్రనాథ్, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గుర్రం గౌతమ్, మార్గాని సురేష్, కడియాల లక్ష్మణరావు, చీరా రాజు, బొప్పన సుబ్బారావు, ఆరే చిన్ని, రాయుడు గణేష్, అన్నపూర్ణ రాజు, దుంగా సురేష్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యం 2.52 లక్షల మెట్రిక్ టన్నులు

- జిల్లాలో 231 కొనుగోలు కేంద్రాలు
- జేసీ తేజ్ భరత్



వీసీలో పాల్గొన్న జేసీ తేజ్ భరత్ తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలోని 231 ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళిక రూపొందించామని జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ రైతుల నుంచి 189.080 మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్లతో మంగళవారం రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్ నుంచి జేసీ తేజ్ భరత్ వ్యవసాయ, సివిల్ సప్లయ్ అధికారు లు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ ఇప్పటికే చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించమన్నారు. ఈ మూడు మండలాల్లో 26 మంది రైతుల నుంచి 189.080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 231 పీపీసీ కేంద్రాలకు 63 లక్షల గన్నీబ్యాగులు అవసరం కాగా, ఇప్పటి వరకు 34 లక్షల గన్నీబ్యాగులు సరఫరా చేసినట్టు తెలిపారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు విషయమై రైతుల సందేహాల నివత్తి కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఇది ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు 83094 87151, 0883–2940788 నంబర్లను సంప్రదించాలన్నారు. వీసీలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు, డీఎస్ఓ పి.విజయభాస్కర్, సివిల్ సప్లయ్ డీఎం ఏ.కుమార్ పాల్గొన్నారు.

సత్యదీక్షకు వేళాయె!

- 27 రోజులపాటు కొనసాగనున్న దీక్ష'
- డిసెంబర్ నాలుగో తేదీన విరమణ
- ఎక్కువ మంది చేపట్టేలా ప్రచారం

అన్నవరం : భక్తవరదుడు, రత్నగిరివాసుడు సత్యదేవుని సత్యదీక్షలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఏటా కార్తికమాసం ముందు వచ్చే స్వామివారి జన్మనక్షత్రం మఖ నాడు దీక్ష ప్రారంభమవుతుంది. 27 రోజుల తరువాత వచ్చే మఖ నక్షత్రం నాడు దీక్ష విరమించడం ఆనవాయితీ. దానిని అనుసరించి ఈనెల ఏడో తేదీన సత్యదేవుని జన్మనక్షత్రం మఖ నక్షత్రం నాడు సత్యదీక్షలు ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 4వ తేదీన మఖ నక్షత్రం నాడు దీక్ష ముగియనున్నాయి. ఎక్కువ మంది భక్తులు సత్యదీక్ష చేపట్టేలా అన్నవరం చుట్టుపక్కల గ్రామాలలో విస్తృత ప్రచారం చేయనున్నారు.

సిబ్బంది ఆచరించాలి : ఈ సారి అన్నవరం దేవస్థానంలో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, నాయీ బ్రాహ్మణులు, పురోహితులు సత్యదీక్ష చేపట్టాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. రెగ్యులర్ సిబ్బంది మినహా మిగిలిన వారందరికీ ఉచితంగా దీక్షా వస్త్రాలు అందచేయనున్నట్టు ఈఓ తెలిపారు. దీక్ష చేపట్టిన వారు ఇంటి వద్ద పీఠం ఏర్పాటు చేసుకునే వీలు లేకపోతే వారు బృందాలుగా ఏర్పడి దీక్ష పీఠం ఏర్పాటు చేసుకునేందుకు సత్యనికేతన్ సత్రంలో గదులు కూడా కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. పురుషులు 27 రోజుల పాటు దీక్ష చేసి డిసెంబర్ నాలుగో తేదీన దీక్ష విరమించాలి. 27 రోజులు దీక్ష చేపట్టే అవకాశం లేని మహిళలు.. ఇతర భక్తుల కోసం 18 రోజుల దీక్ష , తొమ్మిది రోజుల దీక్ష చేపట్టేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అయినా నియమాలు మాత్రం తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

సత్యదీక్ష నియమాలు

- పసుపు వస్త్రాలు ధరించి సత్యదేవుని ఆలయం లేదా మరే ఇతర ఆలయంలో అయినా అర్చకుడు లేదా గురుస్వామి లేదా తల్లి చేతుల మీదుగా తులసి మాల ధరించి సత్యదీక్ష చేపట్టవచ్చు.
- దీక్ష నియమాలన్నీ స్వామి అయ్యప్ప నియమాల తరహా ఉంటాయి.
- సూర్యోదయానికి ముందు నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకోవాలి.
- అనంతంర సత్యదేవుని పూజ చేయాలి. సూర్యాస్తమయం తరువాత స్వామివారికి పూజ చేయాలి.
- దీక్షా స్వాములు ఒక పూట భోజనం, రాత్రి వేళ అల్పాహారం తీసుకోవాలి.
- నేల మీద నిద్రించాలి. బ్రహ్మ చర్యం పాటించాలి. మాంసాహారం, ఉల్లిపాయ కలిసిన ఆహారం తినకూడదు.
- ఎవరినీ పరుషంగా దూషించకూడదు.
- దీక్షా స్వాములందరినీ సత్యదేవుని స్వరూపంగా భావించాలి.

అర్ధగంటలో పూజ పూర్తి



ఈ ఏడాది సత్యదీక్షలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పది వేల మంది దీక్షలు చేపట్టేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించాం. దీక్ష విధానాన్ని వివరించే చిన్న పుస్తకాలను ముద్రించి అందజేయాలని నిర్ణయించాం. పూజ అరగంట వ్యవధి లోనే పూర్తయ్యేలా విధానం రూపొందించాం. దీక్ష చేపట్టిన వారికి మధ్యాహ్నం భోజనం పెట్టనున్నాం. దీక్ష పీఠం వసతి లేని వారు బృందంగా ఏర్పడితే కొండదిగువన సత్యనికేతన్‌లో లేదా పంపా సత్రంలో అవకాశం కల్పిస్తాం.

చంద్రశేఖర్ అజాద్..ఈఓ



సత్యదీక్షలు చేపట్టి భజనలు చేస్తున్న భక్తులు (ఫైల్ ఫొటో)

ఉచితంగా దీక్షా వస్త్రాలు, మాలలు పంపిణీ

దీక్షలు చేపట్టేందుకు మారేడుమిల్లి, అడ్డతీగల, తదితర గిరిజన ప్రాంతాల్లో 800 మంది గిరిజన భక్తులకు మంగళవారం అడ్డతీగల మండలం పవనగిరి స్వామీజీ, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు కారుకోడి పోచమ్మ (పూజ) , ఇతర గిరిజన పెద్దల సమక్షంలో దీక్షా వస్త్రాలు, మాలలను పంపిణీ చేశారు. మరో 200 మంది ఇతర భక్తులకు దీక్షా వస్త్రాలను మాలలను అందజేసినట్లు అసిస్టెంట్ పీఆర్వో పీ లక్ష్మీనారాయణ తెలిపారు. అడ్డతీగల, మారేడుమిల్లి, రంపచోడవరం, కుంట, చింతూరు, మోతుగూడెం తదితర మండలాల గిరిజనులకు దీక్షా వస్త్రాలు అందచేసినట్లు వివరించారు.



అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనభక్తులకు దీక్షా వస్త్రాలు పంపిణీ చేసిన దృశ్యం

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక


శ్రీవిజయదుర్గ

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వీధి శ్రీ విజయదుర్గ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం ఎంఎస్ఎన్ మూర్తి మంగళవారం తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో ఆత్రేయపురంలో జరిగిన నెట్‌బాల్ సెలెక్షన్లల్లో ఎంపిక చేశారని తెలిపారు. శ్రీవిజయదుర్గని పీఈటీ ఆకుల దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు జైలు, జరిమానా

కాకినాడ లీగల్: ట్రాక్టర్‌ను అతివేగంతో నిర్లక్ష్యంగా నడిపి మహిళ మృతికి కారణమైన డ్రైవర్‌కు మూడు నెలల జైలు, రూ.6వేలు జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్‌షరీన్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కరప మండలం వేములవాడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బొండ వీరవెంకట సత్యనారాయణ 2021లో మాధవపట్నం బస్టాండ్ వద్ద నుంచున్న మహిళ చక్రమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ఏపీపీ పి.రఘువీర్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

లారీ ఓనర్స్ సంఘ అధ్యక్షుడిగా రాజు


జిల్లా అధ్యక్షుడు రాజు

కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నడింపల్లి శ్రీనివాసరాజు(ఎస్ఎస్ రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంజయ్ నగర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం జరిగిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘ గౌరవాధ్యక్షుడు చిర్ల అమ్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యక్షుడిగా ఎస్ఎస్‌రాజు, కార్యదర్శిగా బొక్కా వెంకటేశ్వరరావు(అమలాపురం), కోశాధికారిగా విక్రమ్ దుర్గాశ్రీనివాసరావు(తూర్పుగోదావరి జిల్లా)లను ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు దుగ్గన నాగరాజు (బాబ్జి) పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఉమ్మడి జిల్లాలోని 24 సంఘాలకు గాను, 19 సంఘాల కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొని ఎస్ఎస్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు మాట్లాడుతూ అన్ని యూనియన్లను సమన్వయం చేసుకుని పనిచేస్తూ ఎలాంటి సమస్య ఉన్నా సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా రవాణా రంగం ఎదుర్కొంటున్న ఒడిదొడుకులను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి, ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

న్యాక్ ఏ ప్లస్‌తో అంతర్జాతీయ గుర్తింపు

- విదేశీ వర్సిటీలతో ఒప్పందాలు, రెండేళ్లలో వివిధ అభివృద్ధి పనులు
- 98 పోస్టుల మంజూరు
- 'సాక్షి'తో జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు


జేఎన్‌టీయూకే

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): న్యాక్ ఏ ప్లస్ హోదాను సాధించడం ద్వారా జేఎన్‌టీయూకే అంతర్జాతీయంగా గుర్తింపును పొందిందని జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ డాక్టర్ గొట్టిముక్కల వెంకటరామ ప్రసాదరాజు అన్నారు. ఆయన వీసీగా నియమితులై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ సహకారంతో తన హయాంలో వచ్చిన మార్పులను మంగళవారం 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు...


డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, జేఎన్‌టీయూకే వీసీ

సాక్షి : రెండేళ్లలో వర్సిటీలో వచ్చిన కీలక మార్పులు ఏమిటి?

వీసీ: అత్యంత ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఎసెస్‌మెంట్ బోర్డు గుర్తింపు ఏ ప్లస్‌ను వర్సిటీ సాధించింది. దీంతో అంతర్జాతీయంగా జేఎన్‌టీయూకే గుర్తింపు పొందింది. 45 దేశాల్లోని యూనివర్సిటీలతో ఒప్పందాలకు సిద్ధంగా ఉన్నాం.

సాక్షి : వర్సిటీ పరిధిలో ఎన్ని కళాశాలలు ఉన్నాయి, విద్యార్థుల సంఖ్య ఎంత ?

వీసీ: ప్రస్తుతం వర్సిటీ పరిధిలో 2 ప్రభుత్వ, 118 ప్రైవేట్ ఇంజినీరింగ్, 30 ఫార్మసీ, 11 ఎంబీఏ, 28 అటానమస్, 50 శాశ్వత కళాశాలలు ఉన్నాయి. అన్ని కళాశాలల్లో కలిపి దాదాపు 1.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. బీటెక్‌లో 52, ఎంటెక్ 113, ఫార్మా 18, ఎంబీఏ, ఎంసీఏలో 12 రకాల కోర్సులు ఉన్నాయి.

సాక్షి: మీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులేమిటి?

వీసీ: రూ.21 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు, కాకినాడ వర్సిటీ, క్యాంపస్‌లో రూ.97 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేశాం స్నాతకోత్సవ భవన నిర్మాణ పనులు 40శాతం మేర పూర్తయ్యాయి. వచ్చే మార్చిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: పరీక్షల విభాగంలో కొత్త మార్పులు ఏమైనా తీసుకువచ్చారా?

వీసీ: విద్యార్థులకు ఈ ఏడాది జూన్ నుంచి తత్కాల్ ఓడీ (ఒరిజినల్ డిగ్రీ) విధానం ప్రవేశపెట్టాం. ఉదయం దరఖాస్తు చేస్తే సాయంత్రం తీసుకెళ్లవచ్చు. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోర్టల్ రూపొందించి అధ్యాపకుల ర్యాటిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించాం. ముఖ్యంగా అనుబంధ కళాశాలల నుంచి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అఫిలియేషన్ ఫీజు బకాయిలు 70 శాతం వరకూ వసూలు చేశాం. అటువంటి వాటికే ఈ ఏడాది గుర్తింపు ఇచ్చాం.

సాక్షి : కొత్త కోర్సులు ఏమైనా ప్రారంభించారా?

వీసీ: మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా బీటెక్, ఎంటెక్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఏఎంఎల్ వంటి కొత్త కోర్సులు ప్రవేశపెట్టాం. ఈ ఏడాది ఫుడ్ టెక్నాలజీ కోర్సు ప్రవేశాలకు బైపీసీ విద్యార్థులకు అవకాశం కల్పించాం. ఉపాధి కల్పించే కొత్త కోర్సులు ప్రవేశపెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

సాక్షి : పరిశోధనలకు ఎలాంటి ప్రాధాన్యం ఇస్తున్నారు?

జవాబు: వర్సిటీలో ఉన్న ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ప్రాజెక్టులు రూపొందిస్తున్నాం. గిరిజనులకు బైక్ అంబులెన్స్ తయారీ, తేమ నుంచి మంచినీరు తయారు వంటి ప్రాజెక్టులు ప్రభుత్వానికి అందజేస్తున్నాం. యూఎస్ వంటి దేశాల వర్సిటీలతో ఒప్పందాలు చేసుకుని బీటెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్నాం. ఈ ఏడాది జూన్‌లో రాష్ట్ర స్థాయి వీసీల సదస్సుకు జేఎన్‌టీయూకే వేదికగా నిలవడం సంతోషంగా ఉంది.

సాక్షి : వర్సిటీకి సీఎస్ఆర్ ఫండ్ ఏమైనా తెచ్చారా

జవాబు : ఇటీవల నిర్వహించిన స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ అందుకున్న చలమలశెట్టి సునీల్ వర్సిటీలో అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు ప్రకటించి ఇటీవలే శంకుస్థాపన చేశారు. వీటితో గ్రీనరీ ఏర్పాటు, ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టనున్నాం. పూర్వ విద్యార్థి కోట ఎం.సుబ్బు రూ.కోటి వర్సిటీ అభివృద్ధికి ఇచ్చారు.

సాక్షి: వర్సిటీ అభివృద్ధిలో ప్రస్తుత ప్రభుత్వ సహకారం ఎలా ఉంది?

జవాబు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వర్సిటీ ఏర్పాటు చేశారు. అందుకే నేటికీ ఆయనను స్మరించుకుంటున్నాం. ఆయన తనయుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాథమిక దశ నుంచి ఉన్నత విద్య వరకూ ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యలో సమూల మార్పులు, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ వంటి విధానాలు అమలు చేస్తున్నారు. అన్ని వర్సిటీల్లో అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చారు. కాకినాడకు 98 పోస్టులు మంజూరు చేశారు. అధ్యాపకుల పదవీ విరమణ వయసు 62 నుంచి 65 ఏళ్లకు పెంచారు. వీసీగా మూడు సంవత్సరాలు ఉండే ఈ కాలవ్యవధిలో క్యాలెండర్ రూపొందించుకుని ప్రతి నెలా ప్రగతిపై సమీక్ష చేస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి సహకారం వల్ల ఈ రెండేళ్లు కాలయాపన లేకుండా పనులు పూర్తి చేశాను.

వైద్యుని ఇంటిపై దాడి

- దిశ యాప్‌కు కాల్ చేసిన బాధితురాలు
- పది నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించిన పోలీసులు


రేణుకను విచారిస్తున్న దిశ పోలీసు

కాజులూరు: తన పెంపుడు మేకను ఢీకొని గాయాలపాలైన వ్యక్తికి చికిత్సనందించాడనే కోపంతో ఇద్దరు వ్యక్తులు వైద్యుని ఇంటిపై రెండుసార్లు దాడి చేశారు. తొలిసారి వైద్యునిపై దాడి చేసినప్పుడు చుట్టుపక్కలవారు సర్ది చెప్పడంతో శాంతించి వెనుతిరిగిన నిందితులు మరోసారి వైద్యుడు ఇంటివద్ద లేని సమయంలో దాడిచేసి అతని కుమార్తెను తీవ్రంగా గాయపరిచారు. బాధితురాలు దిశ యాప్‌కు కాల్ చెయ్యగా పది నిమిషాల వ్యవధిలో దిశ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. దిశ పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 26వ తేదీన యానాం – ద్వారపూడి రహదారిపై బైక్‌పై వెళుతున్న ఒక వ్యక్తి కాజులూరు మండలం ఉప్పుమిల్లి వద్ద ఒక మేకను ఢీ కొని పల్టీలు కొట్టి తీవ్ర గాయాలపాలయ్యాడు. వైఎస్సార్ కడప జిల్లాలో దంతవైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ రాంప్రసాద్ దసరా సెలవుల నిమిత్తం తన స్వగ్రామం ఉప్పుమిల్లికి వచ్చారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలపాలైన సంగతి తెలుసుకుని అతనికి ప్రథమ చికిత్స చేసి పంపించారు. అయితే తన పెంపుడు మేకను ఢీకొట్టి గాయపరచిన వ్యక్తికి చికిత్స చేస్తావా అంటూ అదే గ్రామానికి చెందిన గుత్తుల శ్రీను, గుత్తుల ప్రసాద్ వైద్యుడు రాంప్రసాద్‌తో ఘర్షణకు దిగారు. స్థానికులు సర్దిచెప్పటంతో వెనుతిరిగారు. సెలవులు ముగియటంతో వైద్యుడు రాంప్రసాద్ విధులకు వెళ్లిపోయారు. సోమవారం నిందితులు మరోమారు వైద్యుని ఇంటికి వెళ్లి అతని కుమార్తె రేణుకపై కర్రలతో దాడి చేశారు. రేణుక, ఆమె భర్త విత్తనాల వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ తెలిపారు.

సహకార సంఘాలకు ఆదాయ మార్గాలను అన్వేషించాలి


కేంద్ర సహకార శాఖ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ వీర్రాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సహకార సంఘాలకు ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలని కేంద్ర సహకారశాఖ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్ఎల్ఎస్‌టి శ్రీనివాస్ సహకార సంఘ అధికారులకు పిలుపునిచ్చారు. కాకినాడ డీసీసీబీలో మంగళవారం సహకార సంఘాల విస్తరణ, సహకార సంఘాల బలోపేతంపై సంఘాల సీఈఓలు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో సహకార సంఘాల ద్వారా రైతులకు అన్ని రకాల రుణాలు అందించాలన్నారు. సహకార వ్యవస్థ ఎంతో పురాతనమైనదన్నారు. సహకార వ్యవస్థపై రైతులకు పూర్తి స్థాయిలో భరోసా కల్పించాలన్నారు. సంఘాలు లాభాలు పొందాలంటే ఆయా ప్రాంతాలకు అనుగుణంగా వ్యాపారం చేయాలన్నారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయం చేసేవారి సంఖ్య రోజురోజుకీ తగ్గుతోందన్నారు. వ్యవసాయ రంగం లాభసాటి కాకపోవడంతో రైతులు వారి పిల్లలను ఈ రంగంలోకి రానివ్వడం లేదన్నారు. ఇదే జరిగితే రాబోయే రోజుల్లో ఆహార ఉత్పత్తులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం సహకార రంగం బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకొంటోందన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ సహకార సంఘాలు లాభా లు సంపాదించాలంటే రైతులకు ఇచ్చిన అప్పులు సకాలంలో చెల్లించే విధంగా సంఘాల సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో పలు సహకార సంఘాలు స్వయంగా వ్యాపారం చేసుకొని లాభాలు సంపాదిస్తున్నాయన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని మిగిలిన సంఘాలు కూడా ఆయా ప్రాంతాలకు అనుగుణంగా వ్యాపారాలు చేయాలన్నారు. డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు మాట్లాడుతూ గతంలో రైతులు కేవ లం సహకార సంఘాల్లో మాత్రమే రుణా లు తీసుకొనేవారన్నారు. ప్రతీ రైతుకు సహకారబ్యాంకులో ఖాతా ఉండేదన్నారు. అనంతరం కోఆర్డినేటర్‌ను శ్రీనివాస్‌ను డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు సత్కరించారు. డీసీసీబీ సభ్యులు బందారు సత్తిరాజు, బ్యాంకు జీఎం ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇరువర్గాలకూ జరిమానా

కాకినాడ లీగల్: దారి విషయమై ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్న కేసులో జరిమానా విధిస్తూ కాకినాడ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్పెషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి మంగళవారం తీర్పు చెప్పారు. అరట్లకట్ట గ్రామం గొల్లపేట ప్రాంతానికి చెందిన చల్లా సూర్యభాస్కరరావు, చల్లా వెంకటలక్ష్మి, చల్లా శివ కలసి సరిహద్దులో ఉన్న తాలుమిల్లి సత్యనారాయణ, తాలుమిల్లి సతీష్‌పై 2017లో దాడి చేశారు. దీనిపై కరప పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో సూర్యభాస్కర్, వెంకటలక్ష్మి, శివలపై నేరం రుజువు కావడంతో ఒకొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ దాడికి సంబంధించి మరో కేసులో అరట్లకట్ట గ్రామం గొల్లపేట ప్రాంతానికి చెందిన తాలుమిల్లి సత్యనారాయణ, తాలుమిల్లి సతీష్ కలిసి సరిహద్దులో ఉన్న చల్లా సూర్యభాస్కరరావు, చల్లా వెంకటలక్ష్మి, చల్లా శివలపై 2017లో దాడి చేశారు. దీనిపై కరప పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో సత్యనారాయణ, సతీష్‌పై నేరం రుజువు కావడంతో సత్యనారాయణకు రూ.5వేల జరిమానా, సతీష్‌కు రూ.వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎ.నాగమల్లేశ్వరి తీర్పు చెప్పారు.

3న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు నోటిఫికేషన్ వెలువడింది. అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో పనిచేసేందుకు 11 మంది మెడికల్ ఆఫీసర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాకినాడలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు డౌన్ లోడ్, మరిన్ని వివరాల కోసం ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీవోవి.ఇన్, కోనసీమ.ఏపి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్లను సందర్శించాలని డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. .

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు నాయకుడిగా ఎంపిక


ఉమామహేశ్వరరావు

పిఠాపురం: మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ 19 బాలుర బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు నాయకుడిగా పిఠాపురానికి చెందిన జమ్మి ఉమామహేశ్వరరావు ఎంపికయ్యాడు. గతంలో ఎందరో క్రీడాకారులు నాయకత్వం వహించినప్పటికి కొన్నేళ్లుగా బాస్కెట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించే అవకాశం పిఠాపురం క్రీడాకారులకు రాలేదు. ఈ నేపథ్యంలో ఈ నెలలో జరిగే జాతీయ పోటీలకు నాయకత్వం వహించే అవకాశం చేజిక్కించుకున్న ఉమామహేశ్వరరావును ఎమ్మెల్యే పెండెం దొరబా బు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, కొత్తెం సుందరకుమార్ అభినందించారు.

కాలువలో జారి పడి వ్యక్తి మృతి


వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఉప్పలగుప్తం: గ్రామానికి చెందిన కోరుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు చల్లపల్లి పంట కాలువలో కాళ్లు కడుగుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందాడని ఎస్సై వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. కాలువలో జారి పడిన వెంకటేశ్వరరావుని ఒడ్డుకి తీసుకొచ్చేసరికి మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు. మృతుడుకి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఉన్నత చదువులకు మరో అవకాశం

- ఇంటర్‌లో ఫెయిలైనవారు రెగ్యులర్, ఓపెన్ కోర్సుల్లో చేరేలా అవగాహన
- ఉమ్మడి జిల్లాలో 17,841 మంది ఫెయిలైన విద్యార్థులు
- కాలేజీల్లో చేరితో రెగ్యులర్ విద్యార్థులతో సమానమే


ఇంటర్ విద్యార్థులు

రాయవరం: ప్రతి విద్యార్థి మధ్యలో చదువు ఆపకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటోంది. 18 సంవత్సరాలు వయసు వచ్చే వరకు విద్యాభ్యాసం చేసేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. సాధారణంగా రెగ్యులర్ పాస్‌కాని విద్యార్థులు పాసైన అనంతరం వారికి ఇచ్చే సర్టిఫికెట్‌లో కంపార్ట్‌మెంట్ అని రాస్తుంది. ఇప్పుడు అలాకాకుండా ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశాన్ని కల్పిస్తోంది. 2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరై పాసైతే మార్కుల మెమోపై కంపార్ట్‌మెంట్ అని కాకుండా రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైనట్లుగా గుర్తింపు ఇవ్వనున్నారు. తప్పిన వాటితో పాటు అన్ని సబ్జెక్టులు రాసినా, ఎక్కువ మార్కులు వచ్చిన వాటినే పరిగణలోనికి తీసుకుంటారు.

ఉన్నత చదువుల వైపు మళ్లించాలనే..

ఇంటర్మీడియెట్‌తోనే ఆగిపోకుండా విద్యార్థులను ఉన్నత చదువుల వైపు తీసుకు రావాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 17,841 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫెయిలైనట్లుగా అధికారులు గుర్తించారు. వీరందరితో వార్షిక పరీక్షలకు ఫీజు కట్టించే బాధ్యతలను కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అప్పగించారు. ఇంటర్మీడియెట్ బోర్డు పరిధిలోని ప్రిన్సిపాల్స్‌తో ప్రతిరోజూ వెబెక్స్ ద్వారా సమీక్ష చేస్తూ, నూరు శాతం లక్ష్య సాధనకు దిశానిర్దేశం చేస్తున్నారు.

ఫెయిలైనా మళ్లీ కళాశాలలకు..

2021-22, 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తప్పిన విద్యార్థులు మళ్లీ కళాశాలలో చేరి చదువుకోవచ్చు. కళాశాలల్లో అడ్మిషన్ తీసుకుంటే వారిని రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణించి 'అమ్మ ఒడి' వంటి సంక్షేమ పథకాలు కూడా మంజూరు చేస్తారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖాధికారులు అవగాహన కలిపిస్తున్నారు.

నవంబరు నెలాఖరు వరకు గడువు

2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యే ఫెయిలైన విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు నవంబర్ నెలాఖరు వరకు గడువు ఉంది. ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించే అవకాశం ఉన్నందున నూరు శాతం లక్ష్యం సాధించేలా విద్యార్థులకు అవసరమైన సహకారం అందించాలని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. వీటిపై సందేహాల నివృత్తికి ఏర్పాట్లు చేశారు.

ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలి



ఇంటర్ ఫెయిలైన విద్యార్థులను తిరిగి కళాశాలల్లో చేర్పించేందుకు ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. సచివాలయ స్థాయిలో జరిగిన డ్రాపవుట్స్ సర్వే ఆధారంగా గుర్తించిన విద్యార్థులందరితో తప్పనిసరిగా ఫీజు కట్టించుకోవాలి. ప్రతి రోజు దీనిపై సమీక్ష చేస్తున్నాం.

– ఎస్ఎస్‌వీఎల్ నరసింహం, ఆర్ఐవో, రాజమహేంద్రవరం

సద్వినియోగం చేసుకోవాలి



ఫెయిలైన విద్యార్థులను తిరిగి కళాశాలలో చేర్పించుకుని, వారిని రెగ్యులర్ విద్యార్థులుగా పరిగణించడం సదవకాశం. దీన్ని ఫెయిలైన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలి. అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకుని శతశాతం విద్యార్థులు చేరేలా ప్రయత్నించాలి.

– ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, డీవీఈవో, అమలాపురం

చోరీకి గురైన మొబైల్ ఫోన్ల రికవరీ

బాధితులకు అందజేసిన ఎస్పీ


రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను బాధితునికి అందజేస్తున్న ఎస్పీ జగదీష్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో చోరీఅయిన లేక పోగొట్టుకున్న 276 మొబైల్ ఫోన్లను రికవరీ చేసిన ఎస్పీ పి.జగదీష్ మంగళవారం బాధితులకు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల కోసం సెంట్రల్ గవర్నమెంట్ సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రేషన్) సేవలను ప్రారంభించామన్నారు. ఇటీవల మొబైల్ ఫోన్ల మిస్సింగ్ కేసులు ఎక్కువకావడంతో అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావు, క్రైం డీఎస్పీ జి.గురునాథ్‌బాబు పర్యవేక్షణలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను బాధితులకు అందజేసే నిమిత్తం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మిస్సింగ్ మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు చాట్‌బాట్, సీఈఐఆర్ విధానంలో ఐదు విడతలుగా రూ.1.61కోట్ల విలువ చేసే రూ.897 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. సీఈఐఆర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఫోన్ చోరీకి గురైన, మిస్సయినా బాధితులు ఈ సీఈఐఆర్ అప్లికేషన్‌ను ప్రజలు ఉపయోగించుకుంటే పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు రికవరీ చేయడం సులభం అవుతుందన్నారు. దొరికిన సెల్‌ఫోన్లను, బిల్లులు లేని సెల్‌ఫోన్లును కొనుగోలు చేయకూడదన్నారు. దొరికిన సెల్‌ఫోన్లు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కి అందజేయాలని ఎస్పీ జగదీష్ సూచించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఫోన్లను రికవరీ చేశామన్నారు. త్రీటౌన్ సీసీఎస్ ఎస్సై షరీఫ్ వారితో మాట్లాడి సెల్‌ఫోన్లు తీసుకువచ్చారన్నారు. జిల్లాలో ఉన్న పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు రికవరీ చేశారన్నారు. సెల్‌ఫోన్లు రికవరీ చేసిన ఎస్‌హెచ్‌వోలు, సీసీఎస్ ఎస్‌హెచ్‌వోలు, సీసీఎస్ ఎస్సై షరీఫ్, హెచ్‌సీలు మునికుమార్, సర్వేశ్వరరావు, సద్గురుమూర్తి, రమేష్, రవికుమార్, ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పీ జగదీష్ అభినందించారు.

ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో

రూ.7 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం


స్వాధీనం చేసుకున్న నగదు, ఏసీబీ అధికారుల అదుపులో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో

తాళ్లపూడి: రూ.ఏడు వేల లంచం తీసుకుంటూ ఇద్దరు రెవెన్యూ అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య ఆధ్వర్యంలోని అధికారుల బృందం మంగళవారం మండలంలోని మలకపల్లి సచివాలయంలో వీఆర్వోపై దాడి చేసింది. ఆ వివరాలిను సౌజన్య వెల్లడించారు. ఈ గ్రామానికి చెందిన జి.వీరరాజు అనే రైతు తన తండ్రికి చెందిన సర్వే నంబర్ 208/4లోని 10 సెంట్ల భూమిని తనఖా పెట్టి బ్యాంకు రుణం పొందేందుకు వెళ్లాడు. ఈ భూమి (22-ఏ) ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్నట్టు తేలింది. రికార్డుల్లో తన భూమి వివరాలను సరి చేయాలని వీరరాజు వీఆర్వో శ్రీనివాస్‌ను కోరారు. అయితే అతడి తండ్రికి చెందిన రెండెకరాల భూమిలో గతంలో ఆ కుటుంబం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు 10 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చింది. మిగిలిన భూమి కూడా ఆన్‌లైన్‌లో మాత్రం ప్రభుత్వ భూమిగా చూపుతోంది. దీంతో వీఆర్వో సూచన మేరకు వీరరాజు డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్‌ను కలిశాడు. ఈ పని చేసేందుకు డిప్యూటీ తహసీల్దార్ రూ.10 వేలు డిమాండ్ చేయగా, రూ.7 వేలు చెల్లించేలా వీరరాజు ఒప్పదం కుదుర్చుకున్నాడు. మలకపల్లి సచివాలయం వద్ద మంగళవారం వీరరాజు రూ.7 వేలు వీఆర్వో శ్రీనివాస్‌కు ఇచ్చాడు. ఆ సొమ్ము తీసుకుంటుండగా అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, ఆ నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య తెలిపారు. కలెక్టరేట్ పనిమీద రాజమహేంద్రవరం వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్‌ను కూడా అరెస్టు చేశారు. ఈ దాడిలో సౌజన్యతో పాటు ఏఈటీ అధికారులు డి. వాసుకృష్ణ, వై.సతీష్, బి.శ్రీనివాస్, విల్సన్ పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు పెదపాలెంలోని టి.సావరంలో ఓ ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సురేష్ బాబు తెలిపారు. అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెంకు చెందిన మచ్చా ధనప్రసాద్ ఆదివారం తన అత్తింటి వారి ఇంటికి వెళ్లారు. తాను ఇంటిలో లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి రూ.50వేలు విలువ చేసే బంగారు, వెండి వస్తువులు, రూ.30వేల నగదు దొంగిలించారు. దీనిపై సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.